అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

# ఏసీబీ వలలో ఎండీపీఓ, ఎంపీఓ




- లంచం తీసుకుంటూ కుమారుడితో సహా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అధికారిణి
- లేఅవుట్ అనుమతి కోసం రూ.45 వేలు లంచం నొక్కుతూ ముగ్గురు అరెస్ట్
- సొంత కొడుకునే పీఏగా పెట్టుకుని లంచాల దందా..

02

శనివారం 13, జూన్ 2026 | సంపుటి :03 | సంచిక :123 | పేజీలు :05 | వెల ₹5


# అప్పుల ఊబిలోకి సింగరేణి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం
- సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని ఫైర్
- సింగరేణి కుంభకోణాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం ఆపదని స్పష్టం



అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్ రావు శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. తన పర్యటనలో భాగంగా సింగరేణి బొగ్గు నిల్వల వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి భూపాలపల్లిలోని ఓసీ–2 గనిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కాగితాల మీదే చూపిస్తున్న బొగ్గు నిల్వలను ప్రత్యక్షంగా చూపిస్తామంటూ అధికారులు దాటవేయడంపై ఆయన మండిపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను గని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగి మైనింగ్ ఏరియాలో పెద్ద ఎత్తున ఉద్రిక్తత నెలకొంది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు అక్కడి నుండి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

– మిగతా 4లో..



- యాంత్రీకరణతో అదృశ్యం అవుతున్న నాగళ్ల, ఎద్దుల బండ్లు
- కూలీల కొరత, నిర్వహణ భారంతో ట్రాక్టర్ల వైపు మొగ్గు చూపుతున్న రైతాంగం

# మూగబోయిన కాడెట్ల చప్పుడు

**వ్యవసాయ రంగంలో వేగంగా కనుమరుగవుతున్న పల్లెటూరి సంప్రదాయం**

02

- "ఆనాటి సంతృప్తి ఇప్పట్లో లేదు" అంటూ వృద్ధ రైతుల ఆవేదన
- భావితరాల కోసం వ్యవసాయ మ్యూజియంలు ఏర్పాటు చేయాలంటున్న నిపుణులు

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : ఒకప్పుడు తెలంగాణ గ్రామాల్లో రైతు కుటుంబాల జీవన విధానంలో, సంస్కృతిలో కాడెట్లు (ఎదుల జంటలు) కీలక పాత్ర పోషించేవి. పల్లెల్లో వ్యవసాయ పనులన్నీ ఎదుల ఆధారంగానే సాగేవి. కానీ, కాలక్రమేణా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో కాడెట్లు, నాగళ్లు, ఎదుల బండ్లు వంటి సంప్రదాయ వ్యవసాయ పరికరాలు నేడు చరిత్ర పుటల్లో కలిసిపోతున్నాయి.





# పోలీసులంటే భరోసా ఉండాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్

అక్షరదర్బార్, హనుమకొండ: పోలీసులు అంటే సాధారణ ప్రజలు, బాధితులకు భరోసా, నమ్మకం కలిగించాలి, అదే తప్పు చేసిన, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారికి పోలీసులంటే భయం కలగాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో నూతనంగా భాద్యతలు చేపట్టిన హన్మకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్ స్పెక్టర్ చేరాలు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు మనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్లు పనిచేయాలని, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు.



# నిబంధనల మేరకే 'ఎన్వోసీ'లు ఇవ్వాలి

- అధికారులను ఆదేశించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ తదితర శాఖలతో ముందస్తు వేలం కమిటీ సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో ఉన్న కలర్ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, కంకర ఖనిజ బ్లాకులకు సంబంధించిన ప్రభుత్వ నియమ నిబంధనలను ఖచ్చితంగా అనుసరిస్తూ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలను (ఎన్వోసీ) మంజూరు చేయాలని సంబంధిత అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్, సాగునీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో "ముందస్తు వేలం కమిటీ" (ప్రీ యాక్షన్ కమిటీ) సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా మండలాల పరిధిలో ఉన్న గ్రానైట్, ఖనిజ బ్లాక్ లకు సంబంధించి అన్ని రకాల ప్రభుత్వ ప్రమాణాలను పరిశీలించిన తర్వాతే తహసిల్దార్లు 'ఎన్వోసీ'లను జారీ చేయాలన్నారు. సక్రమమైన మైనింగ్ ప్రక్రియ ద్వారానే ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో ఖనిజ ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత

మైనింగ్ కమిటీ సమావేశం అనంతరం జిల్లాలో భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, సర్వే, ఎస్ఐఆర్ సంబంధిత అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. "ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ సంబంధిత అంశాలపైనే దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. వాటి పరిష్కారానికి తహసిల్దార్లు, ఆర్డీవోలు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. దరఖాస్తుదారులు తమ సమస్యల కోసం ఆఫీసుల చుట్టూ మళ్లీమళ్లీ తిరగకుండా సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలి అని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, నీటి పారుదల శాఖ ఎస్ఈ రాంప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, గనులు–భూగర్భ శాఖ సహాయ సంచాలకులు రామాచారితో పాటు జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.



# మా ఊరు చేపలు మాకే అమ్మాలి!

### తీర్మానం అమలుకై రోడ్డెక్కిన పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లె గ్రామస్తులు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (జూన్ 13): పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లె గ్రామాల ఉమ్మడి ఊర చెరువులోని చేపలను ముందుగా స్థానిక ప్రజలకే విక్రయించాలనే గ్రామపంచాయతీ తీర్మానాన్ని ఉల్లంఘిస్తూ, అక్రమంగా నగరానికి తరలిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. రాత్రి వేళల్లో దొంగతనంగా చేపలు పడుతూ సొమ్ము చేసుకుంటున్నారని, ఇందులో ఎక్కువ భాగం దళితుల పట్టా భూములే ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా వల్ల మొగుళ్లపల్లి–జమ్మికుంట ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోగా, మొగుళ్లపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ముప్పు సురేష్ వచ్చి శాంతింపజేశారు. ఈ ఆందోళనలో పిడిసిల్ల గ్రామ సర్పంచ్ నైస్కంటి మమత, వార్డు సభ్యులు సురేష్, కట్కూరి ఐలయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. పంచాయతీ తీర్మానాన్ని అమలు చేసి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని సర్పంచ్ మమత హెచ్చరించారు.

# మూగబోయిన కాడెట్ల చప్పుడు

- యాంత్రీకరణతో అదృశ్యం అవుతున్న నాగళ్లు, ఎద్దుల బండ్లు
- కూలీల కొరత, నిర్వహణ భారంతో ట్రాక్టర్ల వైపు మొగ్గు చూపుతున్న రైతాంగం
- "ఆనాటి సంతృప్తి ఇప్పట్లో లేదు" అంటూ వృద్ధ రైతుల ఆవేదన
- భావితరాల కోసం వ్యవసాయ మ్యూజియంలు ఏర్పాటు చేయాలంటున్న నిపుణులు

**వ్యవసాయ రంగంలో వేగంగా కనుమరుగవుతున్న పల్లెటూరి సంప్రదాయం**

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : ఒకప్పుడు తెలంగాణ గ్రామాల్లో రైతు కుటుంబాల జీవన విధానంలో, సంస్కృతిలో కాడెట్లు (ఎద్దుల జంటలు) కీలక పాత్ర పోషించేవి. పల్లెల్లో వ్యవసాయ పనులన్నీ ఎద్దుల ఆధారంగానే సాగేవి. కానీ, కాలక్రమేణా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో కాడెట్లు, నాగళ్లు, ఎద్దుల బండ్లు వంటి సంప్రదాయ వ్యవసాయ పరికరాలు నేడు చరిత్ర పుటల్లో కలిసిపోతున్నాయి.

**- కనిపించని ఆ పాత దృశ్యం..**

గతంలో వర్షాకాలం ప్రారంభమైందంటే చాలు గ్రామాల్లో ఎద్దుల జంటలతో పొలాలు దున్నడం ఒక సాధారణ సుందర దృశ్యంగా కనిపించేది. తెల్లవారుజామునే "హల్లో... హల్లో..." అంటూ రైతు పెట్టే కేకలు, ఎద్దుల మెడలో గంటల చప్పుడు, నాగలి భూమిని చీలుస్తూ చేసే సవ్వడి... ఇవన్నీ పల్లె సీమలకు ఒక ప్రత్యేకమైన అందాన్ని ఇచ్చేవి. ప్రస్తుతం ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, హార్వెస్టర్లు వ్యవసాయ రంగంలో విరివిగా ప్రవేశించడంతో రైతులు వేగవంతమైన ఆధునిక పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా కాడెట్ల వినియోగం గ్రామాల్లో పూర్తిగా తగ్గిపోయింది.

– యాంత్రీకరణ వెనుక ఉన్న కారణాలు ఇవే..

యాంత్రీకరణ వల్ల రైతుల శ్రమ తగ్గి, సమయం ఆదా అవుతున్నప్పటికీ, సంప్రదాయ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకలైన కాడెట్లు అంతరించిపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో తీవ్రమైన కూలీల కొరత వేధించడం, ఎద్దుల మేత ఖర్చులు పెరగడం, వాటి నిర్వహణ భారం కావడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో



యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పల్లెల్లో ఎద్దులను పెంచే రైతుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోవడంతో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది.

### ఆ రోజుల్లో ఉన్న సంతృప్తి ఇప్పుడు లేదు

"ఒక ఎకరం పొలం దున్నడానికి ఆ రోజుల్లో రెండు రోజులు పట్టేది. ఇప్పుడు ట్రాక్టర్‌తో గంటలో పని అయిపోతోంది. అయినా ఆ రోజుల్లో ఉన్న సంతృప్తి, ఆనందం ఇప్పుడు ఎక్కడా లేదు. ఎద్దులతో మాట్లాడుకుంటూ పొలం దున్నడం ఒక యోగం లాంటిది." మొట్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధ రైతు (78 ఏళ్లు) అన్నారు. కాడెట్ల శబ్దం, పల్లెల్లో ఆ పాత రోజులు మళ్లీ తిరిగి రావాలని వృద్ధ రైతులు కోరుకుంటున్నారు.

### వారసత్వాన్ని కాపాడాలి

ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేటి కాలానికి అవసరమైనప్పటికీ, మన గ్రామీణ వారసత్వాన్ని కాపాడే ప్రయత్నాలు కూడా సమాంతరంగా జరగాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పాఠశాల స్థాయిలో 'వ్యవసాయ మ్యూజియంలు' ఏర్పాటు చేసి నాగలి, కాడి, గుంటక వంటి సంప్రదాయ పరికరాలను భావితరాలకు పరిచయం చేయాలని వారు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు అభివృద్ధికి సంకేతాలైనా, సంప్రదాయ వ్యవసాయ సంస్కృతి క్రమంగా కనుమరుగవుతుండటం గ్రామీణ జీవితంలో ఒక పెద్ద శూన్యతను మిగులుస్తోంది. యంత్రాల హోరులో కాడెట్ల చప్పుడు శాశ్వతంగా మూగబోతుందేమోనన్న ఆవేదన పల్లె జనం గుండెల్లో వినిపిస్తోంది.

# ఏసీబీ వలలో ఎండీపీఓ, ఎంపీఓ

- లంచం తీసుకుంటూ కుమారుడితో సహా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అధికారిణి
- లేఅవుట్ అనుమతి కోసం రూ.45 వేలు లంచం నొక్కుతూ ముగ్గురు అరెస్ట్
- సొంత కొడుకునే పీఏగా పెట్టుకుని లంచాల దందా..

అక్షరదర్బార్, నరసింహులపేట: మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండల కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు భారీ దాడి నిర్వహించారు. లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా నరసింహులపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పెనుగొండ రాధిక, మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) కె యాకయ్యలతో పాటు ఎంపీడీఓ కుమారుడు, ప్రైవేట్ వ్యక్తి అయిన సి నాగరాజులను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అసలేం జరిగిందంటే.. నరసింహులపేట



మండలం, పడమటిగూడెం గ్రామానికి చెందిన ఒక ఫిర్యాదుదారుడు తన లేఅవుట్ అభివృద్ధికి సంబంధించిన అధికారిక పని కోసం అధికారులను ఆశ్రయించాడు. నిబంధనల ప్రకారం లేఅవుట్ అభివృద్ధికి సెక్యూరిటీగా ఫిర్యాదుదారుడికి చెందిన 15.75 శాతం భూమిని గ్రామ పంచాయతీకి మార్టిగేజ్ (తాకట్టు) పెట్టేలా గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ఈ అధికారిక ఉత్తర్వులు ఇవ్వడానికి గానూ ఎంపీడీఓ రాధిక, ఎంపీఓ యాకయ్యలు సదరు వ్యక్తి నుండి లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఎంపీఓ ఛాంబర్‌లోనే ఫిర్యాదుదారుడి నుండి ఎంపీడీఓ రాధిక తరపున ఆమెకు పర్సనల్ అసిస్టెంట్, డ్రైవర్‌గా వ్యవహరిస్తున్న సొంత కుమారుడు నాగరాజు రూ.20,000, అలాగే ఎంపీఓ యాకయ్య రూ.25,000 లంచం తీసుకుంటుండగా ముందస్తు వ్యూహం ప్రకారం ఏసీబీ వరంగల్ రేంజ్ అధికారులు దాడి చేసి ముగ్గురినీ పట్టుకున్నారు. నిందితుల నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే పని కోసం సదరు అధికారులు అంతకుముందు కూడా ఫిర్యాదుదారుడి నుండి వరుసగా రూ.30,000, రూ.25,000 వసూలు చేసినట్లు ఏసీబీ విచారణలో తేలింది.

**- కోర్టుకు నిందితులు**

తమ విధులను దుర్వినియోగం చేస్తూ అక్రమంగా లంచం తీసుకున్న ముగ్గురు నిందితులను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వారిని వరంగల్‌లోని 'స్పెషల్ జడ్జ్ ఫర్ ఎస్పీఈ, ఏసీబీ కేసెస్' కోర్టులో హాజరుపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా బాధితుడి వివరాలను గోప్యంగా ఉంచారు.



## వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ సలహాదారుడుగా గందె వెంకన్న

అక్షరదర్బార్,పరకాల: వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ పరకాల శాఖ బ్రాంచ్ అడ్వైజర్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త గందె వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు బ్యాంక్ డైరెక్టర్ల మండలి నిర్ణయం తీసుకోగా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం. సత్యనారాయణరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పరకాల శాఖలో జరిగిన కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె. శ్రీనివాసరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు. కస్టమర్ సేవల మెరుగుదల, బ్యాంకింగ్ సేవల విస్తరణ, స్థానిక వ్యాపారులు, రైతులు, మహిళా సంఘాలతో సంబంధాల బలోపేతానికి వెంకటేశ్వర్లు మార్గదర్శకత్వం వహించనున్నట్లు తెలిపారు. ఆయన అనుభవం శాఖ అభివృద్ధికి దోహదపడుతుందని బ్యాంక్ యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేశారు.

## సైక్లింగ్ పోటీల గోడ పత్రికలు ఆవిష్కరించిన మంత్రి సీతక్క

అక్షర దర్బార్, ములుగు :ఈ నెల 14న ములుగు జిల్లా కేంద్రం లో అస్మిత ఖేలో ఇండియా బాలికల సిటీ సైక్లింగ్ పోటీల గోడ పత్రికలను శుక్రవారం మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మంత్రి సీతక్క తోపాటు కలెక్టర్ హేమంత్ సహదేవరావు బొర్కడే, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ, లోకల్ బాడీ అదనపు కలెక్టర్ సంపద రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కోచ్ శ్రీరామ్ ను కలిసి పోటీలకు హాజరు కావాలని కోరుతూ ఆయన వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని ఆమె తెలిపారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్ అందజేస్తారని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా ఈ పోటీల్లో పాల్గొన్నవారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సైతం అందిచనున్నారని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు తమ సొంత సైకిల్ తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ లు తెచ్చుకోవాలని అన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 12 తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ నంబర్ 8886817492 సంప్రదించాలని ఆమె కోరారు.

## వైద్య సేవలపై ఆర్డీఓ నిఘా

### పరకాల ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

అక్షర దర్బార్, పరకాల: పరకాల ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల సమయపాలన, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి చికిత్స, మందుల లభ్యత, వైద్యుల స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని మందుల నిల్వలు, వైద్య పరికరాలు, సాంకేతిక యంత్రాల పనితీరును కూడా తనిఖీ చేశారు. రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ తనిఖీలో నాయబ్ తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్




అక్షర దర్బార్, ములుగు: ములుగు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ , వివిధ వ్యాపార సముదాయాలు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని మాట్లాడారు. బాలలతో పని చేయించడం నేరం అని, బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పిల్లలతో పనులు చేయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని, పలక బలపం పట్టవలసిన చేతులు పలుగు పారా పట్టవద్దని, బాల కార్మికులను గుర్తించి వారికి అన్ని వసతులను కల్పించి సంపూర్ణ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని అన్నారు. ఇది ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని అన్నారు. ఉచిత న్యాయం ఎలా పొందాలో అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ మాట్లాడుతూ బాలలకు విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధి హక్కులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి వర్గం సహకరించాలని పిలుపునిచ్చారు. బాల కార్మికులు ఎక్కడైనా గుర్తించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. బడీడు బాలలందరూ బడిలో ఉండాలని వారిని పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, బాలల హక్కులకు భంగం కలిగించినట్లయితే యజమానులపైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులు ములుగు బస్టాండ్, హోటళ్లు, మెకానిక్ షాపులు, టీ దుకాణాలు, వ్యాపార సముదాయాలు మరియు ఇతర వాణిజ్య సంస్థలను సందర్శించి బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనుల్లోనూ నియమించరాదని యజమానులకు వివరించారు. అలాగే 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలలను ప్రమాదకర పనుల్లో నియమించడం కూడా చట్ట విరుద్ధమని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, డి సంజీవ ఎల్పిపిఓ , కౌన్సిలర్ సంధ్య, సోషల్ వర్కర్ సుమన్, అవుట్ రిచ్ వర్కర్ భూక్యా రాజు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, ప్రయాణికులు షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన చల్లా

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం వరికోల్, నడికూడ గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పోశాల సరోజన, సాదు శకుంతల, కొక్కిరాల సరోజన కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి పాఠశాలలో అక్షరాభ్యాసాల సందడి

అక్షర దర్బార్, నర్సంపేట (జూన్ 13): నర్సంపేట పట్టణంలోని గీతాంజలి డీజీ ప్రైమరీ పాఠశాలలో విద్యాసంవత్సరం ప్రారంభోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో సరస్వతి పూజ నిర్వహించి, నూతన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు ఉపాధ్యాయులను పరిచయం చేశారు. పాఠశాలలోని ఆహ్లాదకర వాతావరణం, ఉపాధ్యాయుల ఆత్మీయ పలకరింపు తమకు వేద పాఠశాల అనుభూతిని కలిగించాయని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రధానాచార్యులు పాల్గొన్నారు

## కాంటా వేసి పది రోజులైనా.. ఖాతాల్లో పడని వడ్ల పైసలు!

- కొనుగోలు సిబ్బంది అలసత్వంపై మండిపడుతున్న శాయంపేట రైతాంగం

అక్షర దర్బార్, శాయంపేట : అన్నదాతకు విత్తనం వేసిన నాటి నుండి పంట అమ్మి సొమ్ము చేతికి అందేదాకా కష్టాలు తప్పడం లేదు. శాయంపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ వరిధాన్యం కాంటా వేసి తొమ్మిది, పది రోజులు గడుస్తున్నా ఇంతవరకు వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. దీంతో డబ్బుల కోసం రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కంప్యూటర్ ద్వారా అంతర్జాలంలో సకాలంలో నమోదు చేయకపోవడం వల్లే తమకు నిరూపణ సందేశాలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో కొన్ని రోజుల్లో వానాకాలం రుతుపవనాలు ప్రవేశించనుండటంతో, కొత్తగా ఎరువులు, విత్తనాలు కొనడానికి చేతిలో పైసలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కొనుగోలు కేంద్రాల దస్త్రాలను తనిఖీ చేసి, రైతుల సొమ్ము సకాలంలో జమ చేయకుండా తీవ్ర అలసత్వం వహిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.





# ప్రభుత్వ బడుల వైపే.. మన పిల్లల అడుగులు

## ఉపాధి హామీ పని ప్రదేశంలో మర్రిపల్లి సర్పంచ్ డ్యాగం సుజాత సుధాకర్ అవగాహన

అక్షర దర్బార్, దుగ్గొండి : గ్రామాల్లోని తల్లిదండ్రులందరూ తమ బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మర్రిపల్లి గ్రామ సర్పంచ్ డ్యాగం సుజాత సుధాకర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని మర్రిపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రోజా రాణి, మాధవిలతో కలిసి ఆమె బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మర్రికుంట చెరువు వద్దకు వెళ్లి, అక్కడ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసుకుంటున్న కూలీలు, గ్రామస్థుల మధ్య ప్రత్యేక అవగాహన సదస్సు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, రెండు జతల దుస్తులు అందజేస్తోందన్నారు. అలాగే విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసం కోసం ఉదయం పూట పౌష్టికాహారంతో కూడిన రాగి జావ, మధ్యాహ్నం రుచికరమైన భోజన వసతిని ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. కాబట్టి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా, నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బోయిని రంజిత్, వార్డు సభ్యులు డ్యాగం రాణి, ఎరుకల పద్మ, కుక్కముడి రాజేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొండలెక్కి సిగ్నల్ వెతికే కష్టాలకు ముగింపు


- ఏజెన్సీలో ఇంటర్నెట్ విప్లవం
- కొత్తగూడ, గంగారం మండలాల్లో మొబైల్ సేవల విస్తరణకు కలెక్టర్ స్నేహ శబరిష్ యాక్షన్ ప్లాన్

అక్షర దర్బార్, కొత్తగూడ (జూన్ 12): మహబూబాబాద్ గిరిజన ఏజెన్సీ గ్రామాల్లో ఒక ఫోన్ కాల్ చేయాలన్నా, ఇంటర్నెట్ వాడాలన్నా కొండలు, గుట్టలు ఎక్కవలసిన దుస్థితిని శాశ్వతంగా తొలగించేందుకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. కొత్తగూడ, గంగారం మారుమూల మండలాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవల విస్తరణపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో వివిధ టెలికాం సంస్థల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించి, నెట్‌వర్క్ అందని బ్లాక్ స్పాట్ గ్రామాలను గుర్తించి తక్షణమే టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి కాలంలో ఇంటర్నెట్ సేవలు విలాసం కాదు, ప్రతి ఒక్కరి కనీస అవసరమని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రతి కుటుంబం కూడా సాంకేతిక విప్లవంలో భాగస్వాములై ప్రపంచంతో అనుసంధానం కావాలనేదే తన సంకల్పమన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వలేక, విద్యార్థులు ఆన్‌లైన్ చదువులకు, యువత ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్న పరిస్థితులను మార్చేందుకే ఈ ప్రత్యేక ప్రణాళికను చేపట్టినట్లు తెలిపారు. ఏళ్లుగా ఇక్కడ సిగ్నల్ రాదు అనే మాట వినిపించిన పల్లెల్లో, ఇకపై ప్రపంచం చేతిలోకి వస్తుందని గిరిజన ప్రజల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.



# అప్పుల ఊబిలోకి సింగరేణి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం
- సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని ఫైర్
- సింగరేణి కుంభకోణాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం ఆపదని స్పష్టం



అక్షరదర్బార్, భూపాలపల్లి:
భూపాలపల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్ రావు శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. తన పర్యటనలో భాగంగా సింగరేణి బొగ్గు నిల్వల వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి భూపాలపల్లిలోని ఓసీ–2 గనిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కాగితాల మీదే చూపిస్తున్న బొగ్గు నిల్వలను ప్రత్యక్షంగా చూపిస్తామంటూ అధికారులు దాటవేయడంపై ఆయన మండిపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను గని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తీవ్ర తోపులాట జరిగి మైనింగ్ ఏరియాలో పెద్ద ఎత్తున ఉద్రిక్తత నెలకొంది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు అక్కడి నుండి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

### పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో అక్రమాల గుట్టురట్టు

భూపాలపల్లి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగరేణి కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో హరీష్ రావు ప్రసంగించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన మల్టీ–క్రోర్ కుంభకోణాలు, రాజకీయ జోక్యంపై ఆయన ఒక వివరణాత్మక పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆధారాలను బయటపెట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల ఫిక్స్డ్ డిపాజిట్లతో లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నర ఏళ్లలోనే అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. ఓవర్‌బర్డెన్ కాంట్రాక్టులు, సోలార్ పవర్ ప్రాజెక్టులు, పేలుడు పదార్థాల కొనుగోళ్లు, డీజిల్ కొనుగోళ్లలో వందల కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

### కార్మికుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుంది..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించిన 400 కారుణ్య నియామకాలు బీఆర్ఎస్, కార్మిక సంఘాల ఒత్తిడి వల్లే సాధ్యమయ్యాయని హరీష్ రావు గుర్తు చేశారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని, కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, స్థానిక బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు, కార్మికులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలి

- పాఠశాలల పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి
- విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం
- డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- మంత్రి సీతక్క



అక్షర దర్బార్, ములుగు: పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహంలో నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పాల్గొని వసతి గృహంలోని గదులను పరిశీలించారు. అనంతరం ములుగు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్రిటికల్ కేర్ విభాగంలోని, డయాలసిస్ యూనిట్, ఎమర్జెన్సీ వార్డులను మంత్రి ధనసరి అనసూయ సీతక్క, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భాల్లో మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలు, వసతి గృహాలకు చేరుకునే ముందు వసతి గదులు, తరగతి గదులు, వంటశాలలు, హాస్టళ్ల పరిసరాలు పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెలవుల సమయంలో మూసివున్న భవనాల్లో పాములు, తేళ్లు, జెర్రులు వంటి ప్రమాదకర జీవులు చేరే అవకాశం ఉన్నందున పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ రీఓపెనింగ్‌కు ముందే ప్రత్యేక మెగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ, హాస్టల్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మెగా శానిటేషన్ కార్యక్రమానికి అవసరమైన సూచనలు జారీ చేశామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. పిల్లలు వచ్చిన తర్వాత ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తే విద్యార్థులకు మరింత సురక్షిత వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా నిర్మాణంలో ఉన్న డయాలసిస్ సెంటర్ పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,స్థానిక కాన్సిలర్లు,జిల్లా అధికారులు, వైద్యాధికారులు,కో ఆప్షన్ సభ్యులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.